క్లుప్తంగా

శ్రావణమాస పూజలు



ఆత్మకూర్: పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం శ్రావణమాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా వినయ్‌కుమార్, సురేఖ, గోవిందరెడ్డి, వినశ్రీ, నవీన్‌కుమార్, శ్రీదేవి వేంకటేశ్వర్లు, కూరగాయల తిరుపతమ్మ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో మందిర కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు, భక్తులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యూలర్ చేయాలి



వనపర్తి టౌన్: 15ఏళ్లుగా సమగ్ర శిక్షలో పనిచేస్తున్న వివిధ రకాల ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులరైజ్ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవిప్రసాద్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు గురువారం మద్దతు తెలిపి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు కనీస వేతనానికి నోచుకోవడం లేదని వాపోయారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకపోగా.. కనీసం హెల్త్ కార్డులు, సెలవులు లేవని, వారితో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

మెడికో విద్యార్థులకు సన్మానం



ఆత్మకూర్: నీట్‌లో సత్తాచాటి మెడిసిన్ సీట్లు సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సీట్లు సాధించిన ఎంఈఓ భాస్కర్‌సింగ్ కుమారుడు నారేన్‌సింగ్, ఉపాధ్యాయులు దోమ శ్రీను, గీతారాణి దంపతుల కూమార్తె శ్రీజ, ఉపాధ్యాయులు ఉమాశంకర్, నాగప్రియ కుమారుడు నీరజ్‌లను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర, విజయ్, విజయ్ ప్రకాష్, వెంకట్‌రెడ్డి, సద్దల శ్రీనివాసులు, సత్యనారాయణ, గోరంట్ల సత్యనారాయణ, రాజు, వెంకట్రామిరెడ్డి, ధశరథ్ , ప్రశాక్‌లింగం, సత్యన్న, శ్రీరాములు, రఘు తదితరులు పాల్గొన్నారు.


కృష్ణస్వామికి నివాళి



ఆత్మకూర్: హైదరాబాద్ మొట్టమొదటి మేయర్ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, సర్పంచ్ మహముదా, ముదిరాజ్‌సంఘం నాయకులు రాజు, మొగిలన్న, శివ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడదాం

పాన్‌గల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిసున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం మండల కార్యదర్శి దేవేందర్ అన్నారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లిలో పెంచిన ధరలను వ్యతిరేకిస్తూ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలపై పెనుభారం మోపుతూ వారిని మరింత పేదలుగా మారుస్తున్నాయని వాపోయారు. కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తూ వారిని మరింత ధనవంతులుగా మార్చే ప్రక్రియకు ప్రభుత్వాలు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాయని ఆరోపించారు. ప్రతి ఏటా 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ అమలు కాలేదని, మహిళలపై దాడులు పెరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యవసర సరుకుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి నిత్యావసర సరుకుల ధరలను నియంత్రిస్తూ పేదల ఇబ్బందులు తొలగించాలని కోరారు. కార్యక్రమంలో జంబులయ్య, మండ్ల సాయిలు, భీమయ్య, ఎల్లయ్య, శివరాములు పాల్గొన్నారు.





అమరచింతలో..



శాగాపూర్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



శ్రీరంగాపురంలో..

కృష్ణం వందే జగద్గురుమ్



జిల్లావ్యాప్తంగా గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను అన్నప్రసాదం పంపిణీ చేశారు. చిన్నారులు కృష్ణుడు, గోపిక వేషధారణలతో సందడి నెలకొంది. సాయంత్రం ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని వైభవంగా చేశారు. ఉదయం జిల్లా కేంద్రంలోని పాతకోటలో ఉన్న శ్రీకృష్ణ ఆలయంలో నందగోపాల యాదవ సంఘం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం కృష్ణుడు, గోపికల వేషధారణతో శోభాయాత్ర చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, చైర్‌పర్సన్ మంగమ్మ, నాగభూషణంగౌడ్, నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య, కౌన్సిలర్ పాకనాటి కృష్ణ, సతీష్‌యాదవ్, సువర్ణ, కళావతి, వరలక్ష్మి, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



వనపర్తిలో ఉట్టి కొడుతున్న శిశు మందిర్ స్కూల్ విద్యార్థులు



ఖిల్లాఘనపురంలో ఉట్టి కొడుతున్న బాలుడు



ఉప్పరిపల్లిలో శ్రీకృష్ణ భగవానుడి ఊరేగింపు



మద్దిగట్లలో..



ఆత్మకూర్‌లో..



వనపర్తిలో కృష్ణుడికి పూజలు చేస్తున్న భక్తులు



అమరచింత ఆంజనేయ ఆలయం వద్ద..



కదుకుంట్లలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



అమరచింతలో..

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: మండలంలోని మొత్తం 42 బూత్ కమిటీల సభ్యులను పూర్తి స్థాయిలో ఎంపిక చేసి, వారు పార్టీ సూచించే ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించేలా చూడాలని బీజేపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీశైలం, వనపర్తి జిల్లా నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, నాగర్‌కర్నూల్ ఫుల్‌టైమర్ బుద్దన్న సూచించారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన వారు మాట్లాడుతు గ్రామ స్థాయిలో బూత్ కమిటీ సభ్యులు, మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ప్రభుత్వ వైఫల్యాలలను ఎండగట్టాలన్నారు. అందరు నాయకులు సమన్వయంతో పనిచేసి బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బుచ్చిబాబుగౌడ్, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, అంజనేయులు ముదిరాజ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టికెట్‌కు దరఖాస్తు

వనపర్తి టౌన్: బీజేపీ వనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ గురువారం రాష్ట్ర కార్యాలయంలో స్క్రీనింగ్ కమిటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి, సభ్యులు దాసరి మల్లేశం కు దరఖాస్తును సమర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ.. 31ఏళ్లుగా పార్టీ నమ్ముకొని పని చేసిన తనకే పార్టీ టికెట్ ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో పెద్దిరాజు, వెంకటేష్ నాయుడు, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను ఆదుకోవాలి

కోడేరు: ముదిరాజ్ కులస్తులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్యాయం చేసిందని తొలిదశ ఉద్యమకారుడు కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మత్స్యకారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజ్‌లు 65 లక్షల జనాభా ఉంటే బీఆర్‌ఎస్ ప్రకటించిన 115 అసెంబ్లీ అభ్యర్థులలో ఏ ఒక్కటి కూడా ముదిరాజ్‌లకు కేటాయించకపోవడం బాధాకరమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు పాల్గొన్నారు.

నిత్యవసర సరుకులు అందజేత



కొత్తకోట రూరల్: వారం రోజుల క్రితం కురిసిన వర్షాలకు పెద్దమందడి మండలంలోని దొడగుంటపల్లికి చెందిన తిరుమలయ్య మట్టి మిద్దె పూర్తిగా కూలిపోయింది. దీంతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. గ్రామస్తుల ద్వారా సమాచారం తెలుసుకున్న జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అహ్మద్ గురువారం దొడగుంటపల్లికి చేరుకుని బాధిత కుటుంబానికి నిత్యవసర సరుకులతో పాటు వంట సామగ్రి, దుప్పట్లు, టార్పాలిన్ కవర్లు, ఇతర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకుడు జానకీరాం మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన తిరుపతయ్య పరిస్థితిని మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డబుల్‌బెడ్రూం ఇళ్లు మంజూరు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, శ్రీదేవి, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బుద్ధి చెబుదాం



పెబ్బేరులో సంఘీభావ పాదయాత్ర చేస్తున్న నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: రాహుల్‌గాంధీ చేపట్టిన జోడో యాత్ర ద్వారా ప్రజలకు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఏర్పడడంతో పాటు కార్యకర్తల్లో రెట్టింపు ఉత్సాహం వచ్చిందని టీపీసీసీ నాయకుడు ప్రశాంత్‌రెడ్డి అన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా గురువారం జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాన్ని ప్రజలకు వివరిస్తూ నాయకులు పట్టణ, మండల కేంద్రాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పెద్దమందడి మండల అధ్యక్షుడు పెంటన్నయాదవ్, ఖిల్లాఘనపురం అధ్యక్షుడు విజయ్‌కుమార్,



ఖిల్లాఘనపురంలో..

శ్రీరంగాపురం మండల అధ్యక్షులు రాములుయాదవ్, జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, సత్యారెడ్డి, సత్తిరెడ్డి, త్రినాథ్, జయకర్, విజవర్ధన్‌రెడ్డి, వెంకటేష్‌సాగర్, సత్యశీలారెడ్డి, శివన్న, బాలన్న, జైపాల్‌రెడ్డి, నాగేశి, వెంకటయ్య, నరహరి పాల్గొన్నారు.

జాడలేని ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు

- ఏళ్లు గడిచినా సమావేశాలు నిర్వహించని వైనం
- నిధుల మంజూరులో జాప్యం

పాన్‌గల్: గ్రామీణ ప్రాంత రోగులకు స్థానికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఆస్పత్రిని మెరుగ్గా నిర్వహించేందుకు ఉద్దేశించిన ఆస్పత్రి అభివృద్ధి కమిటీలు (హెచ్‌డీఎస్)లు అటకెక్కాయి. స్థానిక ఎంపీపీలు ఆస్పత్రులకు చైర్మన్లుగా వ్యవహరిస్తారు. 'ప్రతి మూడు నెలలకోసారి సమావేశం ఏర్పాటు చేసి ఆస్పత్రుల్లో సమస్యలు గుర్తించి అందుబాటులో ఉన్న నిధులు ఖర్చు చేయాలి. కానీ ప్రభుత్వం నుంచి చాలీచాలని నిధులు విడుదల అవుతుండటంతో ఆస్పత్రుల్లో కనీస వైద్యం అందని దుస్థితి నెలకొంది. వీటి పరిష్కారానికి కృషి చేయాల్సిన కమిటీలు నామమాత్రంగా వ్యవహరిస్తున్నాయి.

మండలంలో..

మండలంలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో ఒక పీహెచ్‌సీ, 10 సబ్‌సెంటర్లు ఉన్నాయి. పీహెచ్‌సీ పరిధిలో ప్రతి మూడు నెలలకోసారి సమావేశం నిర్వహించాలి. కానీ ఎక్కడ అలా జరగడంలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో మలేరియా, జలుబు, దగ్గు తదితర వ్యాధులతో వచ్చే రోగులకు సాధారణ వైద్యం, ప్రసవాలకు వచ్చే గర్భిణులకు ఆస్పత్రుల్లో సరిపడా తాగునీరు, వైద్యులు లేక ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీకి ఏటా రెండు పర్యాయాలు కలిపి రూ.1.75 లక్షలు మంజూరవుతాయి. కానీ రెండేళ్లు అవుతున్నా నేటికీ నిధులు రాలేదని పీహెచ్‌సీ వైద్యులు పేర్కొన్నారు.

అధ్వాన్నంగా పారిశుద్ధ్యం

పీహెచ్‌సీ ఆవరణకు రెండు వైపుల ప్రహరీ గోడ లేకపోవడం, పరిసరాల్లో పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పెరిగిపోయింది. పీహెచ్‌సీలో వైద్యం కోసం వినియోగించిన కాటన్లు, మందుల డబ్బాలు ఆవరణలోనే పారవేస్తుడడంతో దుర్వాసన వెదజల్లుతున్నాయని రోగులు వాపోతున్నారు.



పాన్‌గల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



పీహెచ్‌సీ ఆవరణలో పేరుకుపోయిన చెత్త

అధికారులు మారినా..

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ బోర్డులో అధికారులు మారినా.. వారి స్థానంలో వచ్చిన అధికారుల పేర్లు నమోదు చేయకపోవడం వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనం. ఆయా అంశాలపై అభివృద్ధి కమిటీ చైర్మన్లు ప్రత్యేక దృష్టి సారించి పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సబ్‌సెంటర్లల్లో ఉండని ఎమ్‌ఎల్‌హెచ్‌పీ డాక్టర్లు

మండలంలోని తెల్లరాళ్లపల్లి, చింతకుంట, మాందాపూర్, రేమద్దుల, అన్నారం, బుసిరెడ్డిపల్లి వంటి సబ్‌సెంటర్లల్లో రోగులకు వైద్యం అందించేందుకు ఎమ్‌ఎల్‌హెచ్‌పీలను నియమించింది. ఆయా కేంద్రాలల్లో వారు ఎక్కడ విధులు నిర్వహించకుండా మండల కేంద్రానికే పరిమితమయ్యారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి ఆయా సబ్‌సెంటర్లల్లో వారు విధులు నిర్వహించేలా చూడాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

నిబంధనల మేరకు..

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలను నిబంధనల మేరకు మూడు నెలలకోసారి నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. దీంతో సమస్యలు తీరి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. దీంతో పాటు కమిటీలో మారిన అధికారుల పేర్లను తొలగించి ప్రస్తుతం ఉన్న అధికారుల పేర్లను నమోదు చేయాలి.

– దేవ్‌సింగ్, కిష్టాపూర్ తండా సర్పంచ్

తప్పనిసరి పరిస్థితుల్లో..



రోగులకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొన్ని సబ్‌సెంటర్లల్లో ఎమ్‌ఎల్‌హెచ్‌పీ పేరుతో వైద్యులను నియమించింది. కానీ వారు ఆయా సబ్‌సెంటర్లల్లో విధులు నిర్వహించడం లేదు. దీంతో రోగులు తప్పని పరిస్థితులల్లో మండల కేంద్రంలోని పీహెచ్‌సీకి రావాల్సిన పరిస్థితి నెలకొంది.

– బాల్యానాయక్, తెల్లరాళ్లపల్లితండా

సబ్‌సెంటర్లల్లోనే విధులు..

ఎమ్‌ఎల్‌హెచ్‌పీలకు కేటాయించిన సబ్‌సెంటర్లల్లోనే వారు విధులు నిర్వహించేలా తగు చర్యలు తీసుకుంటాం. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్వహించేలా పీహెచ్‌సీ డాక్టర్‌ను ఆదేశిస్తాం. విధులపై ఆలసత్వం వహించే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటాం.

– డా.సాయినాథ్‌రెడ్డి, ఏఓ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ

నిష్పక్షపాత జర్నలిజం సమాజానికి అవసరం

వనపర్తి: ప్రజాస్వామ్యంలో ప్రజాశక్తే అంతిమ శక్తి అని, ప్రజల పక్షాన నిలిచే నిష్పక్షపాత జర్నలిజమే సమాజానికి అవసరం అని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్ట్ జీవితం ఉన్నతమైనదని, అందరికీ ఆదర్శంగా పనితీరు ఉండాలని సూచించారు. ప్రముఖ రాజకీయ నాయకులు బాల్ థాకరే, ఎల్‌కే అద్వానీలు జర్నలిస్టులుగా పనిచేసి దేశం గర్వించే వ్యక్తులుగా నిలిచారని గుర్తుచేశారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు

జిల్లాకేంద్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వటంతో పాటు మలి విడతలో గృహలక్ష్మి పథకంలో ఆర్థిక సాయం అందించి ఇంటి నిర్మాణానికి సహకరిస్తామన్నారు. త్వరలోనే జర్నలిస్టుల సంఘాల రాష్ట్ర, జాతీయ నాయకులతో పాటు సీనియర్ జర్నలిస్టులను వనపర్తికి రప్పించి ఇంటి స్థలాల పట్టాలను పంపిణీ చేస్తామని తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్‌చైర్మన్ వాకిటి శ్రీధర్, వంగూరు ప్రమోద్‌కుమార్‌రెడ్డి, ఆవుల రమేష్ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

జిల్లా కేంద్రానికి చెందిన సుమారు వంద మంది వెల్డింగ్ అసోషియేషన్ సభ్యులు, ఖిల్లాఘనపురం మండలానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. గురువారం మంత్రి నిరంజన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో వారికి గులాబీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాగరాజు, బుచ్చన్న, వెంకటయ్య, రజిత్, కుర్మయ్య, కృష్ణయ్య, సూర్యనారాయణ ఉన్నారు.